క్లుప్తంగా

ఇదేమి పని సార్..!



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎలక్ట్రికల్ స్కూటీకి చార్జింగ్ పెట్టిన దృశ్యం

నెల్లిమర్ల రూరల్: పెట్రోల్ ధరలు పెరగడంతో ప్రస్తుతం విద్యుత్ వాహనాల వినియోగం జిల్లా అంతటా పెరిగింది. కాలుష్యం కూడా లేకపోవడంతో ప్రభుత్వాలు కూడా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఒక పక్క విద్యుత్ శాఖకు కూడా ఎంతో కొంత ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నాయి. అయితే ప్రస్తుతం కరెంటు బిల్లులు విపరీతంగా పెరగడం కాబోలు...నెల్లిమర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి ఏకంగా తన విద్యుత్ స్కూటీకి కార్యాలయంలోనే చార్జింగ్ పెట్టేస్తున్నాడు. గడిచిన కొన్ని రోజులుగా సదరు అధికారి ఇదే వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీతం చాలక ప్రభుత్వ కార్యాలయంలో చార్జింగ్ పెడుతున్నారేమోనని పలువురు సెటైర్లు వేయడం విశేషం.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు

- డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకే కాకుండా దేశానికే తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం స్థానిక డీసీసీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలో ఆయన కృషి మరువలేనిదని చెప్పారు. పది సంవత్సరాల పాటు దేశ ప్రధానిగా ఉంటూ నీతి,నిజాయితీ గల వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూడి శ్రీనివాసరావు, డాక్టర్ గేదెల తిరుపతి, సతీష్, రామచంద్రరాజు, సురేష్, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి..



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న అతిథులు, అధ్యాపకులు

భోగాపురం: ప్రతి విద్యార్థీ సృజనాత్మకంగా ఆలోచించాలని భీమిలి ఉమెన్ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి జి. ప్రశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని కవులవాడ అవంతి పాలిటెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. మల్లేశం దొర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన టెక్ ఉత్సవ్ 2కె25 కనెక్టింగ్ విత్ ఫ్యూచర్ అవగాహన సదస్సును వారు ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర పరిధిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పిల్లల్లో ఇమిడి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను ఇటువంటి సదస్సుల ద్వారా వెలికితీయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. గోవింద్, శెట్టి మహేష్, ఎ.చంద్రశేఖర్, కె.భాస్కరరావు, జి. అశోక్ కుమార్, కె.హేమ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలో పార్లమెంట్‌కు సిద్ధం కండి



మాట్లాడుతున్న లక్ష్మయ్య, తదితరులు

విజయనగరం రూరల్: రవాణారంగ కార్మికులు రాత్రీ,పగలు కష్టపడితే రోజుకు రూ.500 ఇంటికి తీసుకువెళ్లడం గగనంగా ఉందని, ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమని ఆర్టీడబ్ల్యూఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ఆరోపించారు. ఈ మేరకు సమస్యల పరిష్కారానికి మార్చిలో చేపట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో రహదారి రవాణా సవాళ్లు – ప్రభుత్వ విధానంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్యారల్ క్రూడ్ ఆయిల్ ధర 109 డాలర్ల నుంచి 73కు పడిపోయినా.. డీజిల్, పెట్రోల్ ధరలు మాత్రం రూ. 60 నుంచి వంద రూపాయలకు చేరుకోవడం దారుణమన్నారు. డీజిల్ ఎక్కువగా వినియోగించే ఆర్టీసీ లాంటి సంస్థలకు రాయితీ ఇవ్వాల్సి ఉన్నా, పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మార్చిలో చేపట్టనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్ మోహనరావు, పాపారావు, రామునాయుడు, సూరిబాబు, అప్పలనాయుడు, దేవుడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాడు జోరు.. నేడు బేజారు..

- పడకేసిన ఇళ్ల నిర్మాణాలు..
- నెరవేరని పేదల సొంతింటి కల
- స్థలాలు విక్రయిస్తున్న లబ్ధిదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



గుంకలాం లే అవుట్‌లో పునాదుల్లోనే నిలిచిన నిర్మాణాలు

విజయనగరం రూరల్: పేదింటి అక్కాచెల్లెమ్మల సొంతింటి కల సాకారం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో వేలాది మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. నిర్మాణాలకు సైతం ఆర్థిక సాయం చేసి, జోరుగా పనులు జరిగేలా ప్రోత్సహించారు. అయితే అనంతర కాలంలో వచ్చిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలబడకపోవడంతో నిర్మాణాలు పడకేశాయి. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్‌సీపీ హయాంలో మండలంలోని గుంకలాంలో జగనన్న లే అవుట్ ఏర్పాటు చేసి 12,500 మందికి పైగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఇంటి నిర్మాణం చేసుకున్న ప్రతి ఒక్కరికీ పిలిచి మరీ ప్రభుత్వం రుణం అందజేసింది. అలాగే ఇంటికి సంబంధించిన నిర్మాణ సామగ్రిని కూడా అందజేసేవారు. దీంతో అప్పట్లో నిర్మాణాలు జోరుగా సాగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఎటువంటి రుణాలు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. అలాగే జగనన్న కాలనీలో ఎటువంటి మౌలిక వసతులు కూడా కల్పించకపోవడంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చేతులు మారుతున్న పట్టాలు

ఇదిలా ఉంటే ఎలాగూ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు తమ ఇంటి స్థలాలను విక్రయించేస్తున్నారు. సెంటున్నర స్థలం ఆయా ప్రాంతాన్ని బట్టి లక్షల రూపాయలు పలుకుతోంది. ముఖ్యంగా గుంకలాం లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల క్రయ, విక్రయాలకు ప్రత్యేకంగా బ్రోకర్ల టీమ్ తిరుగుతోందని పలువురు చెబుతున్నారు. వారు లే అవుట్‌లో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించడం.. వాటి యజమానుల అడ్రస్సులను సేకరించి స్థలం విక్రయించేలా ప్రోత్సహిస్తున్నారు. ఒకవేళ లబ్ధిదారులు వేరే ప్రాంతంలో ఉంటే వారికి తెలియకుండానే హౌసింగ్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో డూప్లికేట్ పట్టాలు తయారు చేయించుకుని స్థలాలను విక్రయించేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

గతంలో ఎంతో అభివృద్ధి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే కాలనీలో రహదారులు, విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పించడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇటువైపు కన్నెత్తి చూసిన నాయకుడే లేడని లబ్ధిదారులు చెబుతున్నారు. లే అవుట్‌ను పూర్తిగా పట్టించుకోవడం లేదని... కనీసం నిర్మాణాలు పూర్తి చేసిన వారికి బిల్లులు కూడా చెల్లించలేదని మండిపడుతున్నారు.

అంతా గోప్యం..

గుంకలాం లేఅవుట్‌కు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం కావాలని హౌసింగ్ శాఖ సిబ్బందిని అడిగితే ఏఈ ఎవ్వరికి ఇవ్వవద్దన్నారని సిబ్బంది చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఏఈ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా.. ఈ మధ్య బిజీగా ఉన్నాం అని సమాధానం ఇచ్చారే తప్ప వివరాలు చెప్పడం లేదు.



బిల్లులు అందక మధ్యలోనే ఆగిన నిర్మాణాలు



జగనన్న సమయంలో వేసిన విద్యుత్ లైన్లు

బిల్లు రాలేదు..

గుంకలాం లేఅవుట్‌లో స్థలం మంజూరు కావడంతో పునాదులు వరకు పనులు చేశాం. కాని ఇంత వరకు బిల్లు మంజూరు కాలేదు. బిల్లు మంజూరైతే మిగిలిన పనులు చేద్దామనుకున్నా.. కాని ఇంతవరకు బిల్లు రాలేదు.

– కె.సత్యవతి, లబ్ధిదారు

స్థలం ఇచ్చేస్తారా అని అడిగారు..

గుంకలాం లేఅవుట్‌లో నాకు జగనన్న ప్రభుత్వంలో ఇంటి స్థలం వచ్చింది. నా స్థలానికి ఆనుకుని వెనుక భాగాన లేఅవుట్ వేయడానికి కొంతమంది నా స్థలం ఇచ్చేస్తారా అని అడిగారు. మీరు అడిగినంత డబ్బులు ఇస్తాం అంటూ పదేపదే అడుగుతున్నారు. నేను ఇవ్వలేదు. రుణం మంజూరైతే పనులు చేపడతాను.

– టి.ఆదిలక్ష్మి, లబ్ధిదారు

ప్రజా సమస్యలపై గళం విప్పండి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స



ఎమ్మెల్సీ పెనుమత్సకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై గళం విప్పాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సూచించారు. జరజాపుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలోని ఎమ్మెల్సీని శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పెనుమత్స అప్పలరాజు, మన్యపురి మోహన్, మద్దిల వెంకటరమణ, బోలె సన్నిబాబు, సుద్దాపు రమణ, బుగత తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట, కోరాడపేట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. అనంతరం రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దన్నానపేట సర్పంచ్ గేదెల రామచిరంజీవి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కోరాడపేటలో టీఆర్‌టీఎస్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్: నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రూపొందించిన క్యాలెండర్, డైరీలను డిప్యూటీ జనరల్ మేనేజర్ దోసూరి దాలినాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఆలుగు వెంకటరావు, ఏజీఎం శ్రీధర్, ఎస్‌డీఈ శైలజ, తామాడ కృష్ణకుమారి, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం..

- ప్రజా విజయం పార్టీ వ్యవస్థాపకుడు షణ్ముఖరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ఈ దేశానికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం అవసరమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజావిజయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.షణ్ముఖరావు అన్నారు. అంబేడ్కర్ కూడలిలో గల ప్రజా గ్రంథాలయంలో పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్‌రాజు, పార్టీ కార్యదర్శి సీహెచ్ బంగారురాజు, మహిళా సంఘం కన్వీనర్ జి.భవానీ, ప్రజా సంఘాల నాయకులు సోము మురళీమోహన్, కెల్ల సత్యం, శిరాపు శ్రీనివాసరావు, రేగెటి సంతోష్, గరుగుబిల్లి వినయ్‌బాబు, పెంట సంతోష్, గండిబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంపొందించండి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల వివరాల నమోదును ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే సూర్యఘర్ పథకం ఆవశ్యకతను అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 20వ తేదీలోగా సమావేశాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్పటళ్లు, హోటళ్లు వంటి సంస్థలలో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి గృహ సముదాయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారా, లేదా అన్నది తనిఖీలు నిర్వహించాలన్నారు. త్వరలోనే ఎన్టీఆర్ భరోసా దివ్యాంగ పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం పాల్గొన్నారు.

అందరి సమష్టి కృషితోనే నగరాభివృద్ధి..

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



కార్పొరేషన్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి



హాజరైన కౌన్సిల్ సభ్యులు

విజయనగరం: అందరి సమష్టి కృషితోనే నగరాభివృద్ధి జరుగుతుందని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 8 అంశాలపై చర్చ అనంతరం వాటిని సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పలువురు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల పలువురు కార్పొరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. అందరి సమష్టి కృషి ఫలితంగా నగరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆర్థిక వనరులను పెంపొందించుకుని తద్వారా ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది మరింతగా శ్రమించాలని అన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అభినందనలు..

విజయనగరం అర్బన్: డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా విజేతలు ఎం.వాగ్దేవి, కె.గీతాశ్రీ, పి.దీక్ష, టి.సాహితీ, కె.జాహ్నవి, బి.షార్ని, జి.శరాంజి, బి.ఉమాదేవిలకు జేసీ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మధుసూదనరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి..

విజయనగరం అర్బన్: జిల్లాలోని మెంటాడ మండలం గురమ్మవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సు బోల్తాపడిన సంఘటనలో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులను ఆదుకోవాలని ఆర్టీసీ అధికారులను విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్ను దొర ఆదేశించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఆయన స్పందించి వెంటనే ఆర్టీసీ ఈడీ విజయ్ కుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణలను ఫోన్‌లో సంప్రదించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన కిలారి సిద్దు, చందక కాశీ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై అప్పారావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల ఒకటో తేదీన రాజేంద్రవర్మ లోకేష్ అనే వ్యక్తి తన స్నేహితుడు గణేష్‌తో కలసి బైక్‌పై బంగారమ్మ గుడికి వెళ్తుండగా.. మధ్యలో అదే గ్రామానికి చెందిన కిలారి సిద్దు, చందక కాశీ అనే ఇద్దరు వ్యక్తులు బైక్ లోకేష్‌పై దాడి చేశారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎన్వీ ప్రభాకర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో రహదారులు, తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక సోనియానగర్‌లో సుమారు రూ. 5.19 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో విద్యుత్ ఎంతో కీలకమన్నారు. సోలార్ పవర్‌పై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. కేవలం విద్యుత్ రంగంలోనే కాకుండా రహదారులు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలవలస యశస్వి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ముువ్వల లక్ష్మణరావు, ఈఈలు త్రినాథరావు, పి.హరిత, తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో ప్రత్యేక పూజలు..



విజయనగరం మండలం సారిక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనారాయణం ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహావిష్ణువును ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– విజయనగరం రూరల్

నిత్యావసర సరుకుల పంపిణీ..



విజయనగరంలోని కణపాక అగురవీధిలో 50 మంది పేదలకు ప్రముఖ వ్యాపారవేత్త పెంటపాటి మార్కండేయులు శుక్రవారం బియ్యం, గోధుమనూక, తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, అప్పలస్వామి, తులసీరామ్, మధు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

రామాయణ పారాయణం..



నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం గ్రామంలో ఉన్న గోదా రాజగోపాలస్వామి ఆలయంలో రామాయణ పారాయణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విశాఖకు చెందిన భగవత్ రామానుజదాస బృంద సభ్యులు శ్రీమద్రామయణంలో ఉన్న 24 వేల శ్లోకాలను 1150 శ్లోకాలుగా సంకలనం చేసి శ్లోకి రామాయణ పుస్తకాన్ని తయారు చేశారు. ఈ సహస్ర శ్లోకి రామాయణాన్ని 108 ఆలయాల్లో పారాయణం చేస్తున్నట్లు బృంధ ప్రతినిధి కందాల రాజగోపాలాచార్య స్వామి తెలిపారు. ఇప్పటివరకు 19 ఆలయాల్లో పారాయణాలు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

పారిశుధ్య కార్మికులతో సమానంగా..



మున్సిపల్ ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో కలసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు మెరుగైన వేతనాలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం నాయకుల శ్రీను, పైడిరాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

సావిత్రిబాయి పూలే స్ఫూర్తిదాయకం..

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే మహిళా లోకానికే స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. వాడవాడలా సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద, ఎల్‌బీజీ నగర్, తిరుమల నర్సింగ్ కళాశాల వద్ద సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు.

– విజయనగరం ఫూల్‌భాగ్/ అర్బన్



ఫూల్‌బాగ్: సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ సంఘ నాయకులు



విజయనగరం అర్బన్: నివాళులర్పిస్తున్న గ్రంథాలయ యువజన సేవా సంఘ సభ్యులు

కొండరాజు చెరువు కలుషితం..



కలుషితమైన చెరువు నీరు

భోగాపురం: మండలంలోని గూడెపువలస ప్రాంతానికి సమీపంలో ఉన్న కొండరాజు చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ట్యాంకర్లతో కెమికల్ నీటిని తెచ్చి కలుపుతున్నారు. అయితే ఈ నీరు ఎయిర్‌పోర్టుకు సంబంధించినదా లేదా కెమికల్ ఇండస్ట్రీ నుంచి తెచ్చి చెరువులో వదిలేస్తున్నారా అన్న దానిపై స్థానికులు నుంచి పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఇటీవల రెండు ఆవులు మృతి చెందాయి. కలుషిత నీరు తాగడం వల్లే ఆవులు మృతి చెంది ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి వెంటనే స్పందిస్తూ స్థానిక నేతలను ఆ ప్రాంతానికి పంపించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గజపతినగరం నియోజవర్గ జనసేన ఇన్‌చార్జ్ మర్రాపు సురేష్, జిల్లా నాయకులు లోకం ప్రసాద్, సర్పంచ్ మట్టా అయ్యప్పరెడ్డి, తదితరులు శుక్రవారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి ఎయిర్‌పోర్టు ప్రతినిధులు, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారులతో మాట్లాడుతూ.. చెరువు నీటి కలుషితంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పిడుగు జోగరావు, తదితరులు పాల్గొన్నారు.